
# రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు అర్హత

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో జరుగుతున్న 42వ జాతీయ సబ్ జూనియర్(అండర్-18) బాలబాలికల ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం జరిగిన కాంపౌండ్ రౌండ్‌లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 30 మంది బాలురు, 15 మంది బాలికలు ఉత్సాహంగా పోటీ పడ్డారు. వీరందరికీ డబుల్ ఫిఫ్టీ(50+50)లో 72 యారోస్ ర్యాంకింగ్ రౌండ్‌లో తొలి 16 మంది చొప్పున వ్యక్తిగత ఒలింపిక్ రౌండ్‌కు సాంకేతిక కమిటీ ఎంపిక చేసిందని రాష్ట్ర విలువిద్య సంఘం ప్రధాన కార్యదర్శి బెవర వెంకటరమణ తెలిపారు. ఒలింపిక్ రౌండ్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఆర్చర్లను రాష్ట్ర కాంపౌండ్ జట్లకు ఎంపిక చేశామన్నారు. బాలికల విభాగంలో కేఎస్ లేహ్యారెడ్డి, ఎ.కన్నిక, కె.రిషి కీర్తన, ఎం.సూర్య హంసిని, బాలుర విభాగంలో పి.చరణ్‌శ్రీకర్, కె.బుద్ధేశ్వరరావు, ఎం.సుహాస్, ఇ.సాయి రాధాకృష్ణమూర్తి తొలి నాలుగు స్థానాల్లో నిలిచి రాష్ట్ర జట్లలో స్థానం సాధించారు. విజేతలకు రాష్ట్ర విలువిద్య సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, కోశాధికారి కృష్ణకుమారి, ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ అతిథులుగా హాజరై పతకాలు బహూకరించారు. సాంకేతిక కమిటీ సభ్యులు విజయభరద్వాజ, ధనుంజయ, వంశీ, సాహిత్, ఎం.జయలక్ష్మి, చంద్రిక, ధనుష్, దామోదర్ పాల్గొని విజేతలను అభినందించారు.




**విజేతలతో సత్యనారాయణ, కృష్ణకుమారి, వెంకటరమణ, శ్రావణ్‌కుమార్, సాంకేతిక కమిటీ సభ్యులు**

## ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే 23వ ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తలపడేందుకు జిల్లా నుంచి పలువురు అథ్లెట్లు అర్హత సాధించారని ఉమ్మడి కృష్ణా జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.హరిగోపాల్ తెలిపారు. ఆదివారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు. పురుషుల విభాగంలో కంది గంగాధరరావు, ఎం.మల్లికార్జునరావు, ఎల్.రవీంద్రరావు, జి.శ్రీనివాస నాయక్, పి.రామకృష్ణ, మహిళల విభాగంలో ఏవీ సుబ్బలక్ష్మి, ఎం.అరుణ భారత మాస్టర్స్ అథ్లెటిక్స్ జట్టులో స్థానం సాధించారు. ఇటీవల పట్నాలో జరిగిన జాతీయ లేజర్ రన్ ఛాంపియన్‌షిప్‌లో రెండు పసిడి పతకాలు కైవసం చేసుకోవడమే కాకుండా వచ్చే నెలలో దక్షిణాఫ్రికాలో జరిగే ప్రపంచ లేజర్ రన్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన మాస్టర్ అథ్లెట్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాస నాయక్(హెచ్‌సీ-433)ను.. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ జీవీఎస్ శర్మ సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు పి.జ్యోతి ప్రకాష్, కోశాధికారి మరీదు హరిగోపాల్ పలువురు మాస్టర్స్ అథ్లెట్లు పాల్గొన్నారు.



**శ్రీనివాస నాయక్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న జీవీఎస్ శర్మ, తదితరులు**